క్లుప్తంగా

పెన్షనర్ల రాష్ట్ర కమిటీలో వైకుంఠరావు



సత్తుపల్లిరూరల్: రాష్ట్ర ఆల్ పెన్షనర్ల రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా సత్తుపల్లి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వైకుంఠ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ బాధ్యులు ఎంఎం ఎస్ఆర్ శర్మ, జి.సాయి, వంగరి పద్మారావు, వెంకటేశ్వర్లు, గంగాధర్‌రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

నేడు వైఎస్ షర్మిల పర్యటన

వైరా: కొణిజర్ల మండలం తనికెళ్లలో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం పర్యటించనున్నారు. ఈ విషయాన్ని పార్టీ వైరా నియోజకవర్గ కో ఆర్డినేటర్ ధర్మసోత్ రాం నాయక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆమె పరామర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత తనికెళ్లలోని తుమ్మలపల్లి రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన రైతులతో సమావేశమవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం 9.30గంటలకల్లా హాజరుకావాలని కోరారు.

వేసవి ఉచిత కరాటే శిక్షణా తరగతులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం నుంచి నెల రోజుల పాటు లయన్ బుడోఖాన్ కరాటే హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శిక్షకులు వి.పిచ్చయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 9441201769కు సంప్రదించాలని పేర్కొన్నారు.

గొలుసు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వైరా: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌కు చెందిన వృద్ధురాలు గృహలక్ష్మిపై దాడి చేసి గొలుసు ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా వైరా బీసీకాలనీకి చెందిన చింతమాల శ్యాంసన్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశామని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు ఆయన నుంచి గొలుసు స్వాధీనం చేసుకుని మధిర కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

తల్లాడ: తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో శనివారం ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మోటార్ సైకిల్‌పై ఉన్న గోడ సెల్వరాజు, పాముల శ్రీనుకు గాయాలయ్యాయి. అదే సమయాన సత్తుపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య క్షతగాత్రులను పరామర్శించి తన వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

మసీదు కమిటీ అధ్యక్షుడిగా మున్నీరుద్దీన్

కారేపల్లి: కారేపల్లి జామే మసీదు కమిటీ అధ్యక్షుడిగా షేక్ మున్నీరుద్దీన్‌ను ఎంపిక చేసినట్లు తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు నుంచి వచ్చిన నియామక పత్రాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ శనివారం అందజేశారు. దీనికి సంబంధించి కారేపల్లి జామే మసీదులో విలేకరులకు వివరాల వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా షేక్ షఫీ, జనరల్ సెక్రటరీగా షేక్ యాకూబ్ పాషా, కార్యదర్శిగా ఎండి.యాకూబ్ అలీ, కోశాధికారిగా షేక్ సర్దార్, సభ్యులుగా షేక్ షంషుద్దీన్, పటాన్ ఉద్దన్‌ఖాన్‌లను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎండి.హనీఫ్, షేక్ అబ్దుల్ మతీన్, షేరు, తౌహీద్, యాకూబ్ పాషా, అజ్మత్ పాషా, బాబు, తాజుద్దీన్, సికిందర్‌బాబా, అతీక్, ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏన్కూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఆరెం వరలక్ష్మీ కోరారు. మండలపరిధిలోని లచ్చగూడెం, ఏన్కూరు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నాగలక్ష్మీ, ఏఓ నర్సింహారావు, ఏఈఓ బాలకృష్ణ, మేడ ధర్మారావు, రేగళ్ల తిరుమలరావు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన

మధిర: మండలంలోని రొంపిమళ్ల గ్రామంలో దళితబంధు పథకం కింద మంజూరైన పలు యూనిట్లను శనివారం ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. దళితబంధు పథకంలో భాగంగా లబ్ధిదారుడు కారుమంచి రామకృష్ణ కారును కొనుగోలు చేయగా ఆయనతో మాట్లాడి ఈ పథకం కింద లబ్ధిపొందగా ఆర్థిక అభివృద్ధి ఎలా ఉందని ఆయనను అడిగి తెలుసుకున్నారు.

పేరుకే కేంద్రం.. కొనుగోళ్లు జాప్యం

- ధాన్యం రైతుల పడిగాపులు
- అకాల వర్షం భయంతో కంటిమీద కరువవుతున్న కునుకు
- కాంటా వేసినా తరలింపులో ఆలస్యం
- ఆపై మిల్లర్ల కొర్రీలతో లబోదిబోమంటున్న అన్నదాతలు



సత్తుపల్లి రూరల్: సదాశివునిపేటలో కేంద్రంలోని దళారులకు కాంటా వేస్తున్న రైతులు



వేంసూరు : వర్షం భయంతో ధాన్యం రాశులపై రైతులు కప్పిన పట్టాలు

సత్తుపల్లిరూరల్/వేంసూరు: రైతులు యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరతు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ఐకేపీ, సొసైటీల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితుల కారణంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాల్లో జాప్యం జరుగుతుండడం, మరోపక్క వర్షాల భయంతో అన్నదాతలు బిక్కుబిక్కుమంటూ కంటి మీద కునుకు లేకుండా జాగారం చేస్తున్నారు. ఇక కాంటా పూర్తయ్యాక మిల్లులకు తరలిస్తే అక్కడ తేమ, తరుగు పేరుతో దిగుమతి చేసుకోకపోవడంతో మరింత ఇబ్బంది ఎదురవుతోంది. ఇలా అష్టకష్టాలు పడుతున్న తమ విషయంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులు కోరుతున్నారు.

తరుగుతో దిగులు.

ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పండించిన ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించి మిల్లరు చెప్పినట్లు కాంటా వేయమటం దారుణమని రైతులు వాపోతున్నారు. తాలు, తేమశాతం అన్ని సక్రమంగా ఉన్నా.. తరుగు పేరుతో రైతులను నష్టబ్బాల పాలు చేసేందుకు మిల్లర్లు కుమ్మక్కై ఈ విధంగా వ్యవహరిస్తూ కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఇక రైతులు ఆరబెట్టిన ధాన్యం తేమ సక్రమంగానే ఉందని ఏఈఓలు అంగీకరించినా కాంటా జాప్యం జరుగుతోంది. వేంసూరు మండలంలోని అమ్మపాలెం సొసైటీ పరిధి కల్లురుగూడెంలో నేటి వరకు కొనుగోళ్లు ఆరంభించకపోవడం గమనార్హం. కాగా, కాంటా పూర్తయిన చోట వాహనాలకు లోడింగ్ జరగడం లేదు. దీంతో వాహనాలు వచ్చి మిల్లులకు తరలించే వరకు రైతులే కాపలా ఉండాల్సి వస్తోంది. అయితే, వాతావరణంలో మార్పులు వస్తుండడం, తరచుగా వర్షం పడుతుండడంతో ధాన్యాన్ని ఆరబెట్టడం.. వాతావరణం మారగానే మళ్లీ కుప్ప చేయడం ఇలా కుటుంబాలతో సహా శ్రమించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంటాల ఆలస్యం..



కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎండబెట్టిన సరైన తేమ శాతం వచ్చిందని ఏఈఓలు సర్టిఫై చేశారు. కానీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభించడం లేదు. దీంతో వేచి ఉండలేక పలువురు రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. వాతావరణం మారుతున్నందున అధికారులు కొనుగోళ్లలో వేగం పెంచేలా చూడాలి.

– పుచ్చకాయల లక్ష్మారెడ్డి, రైతు, కల్లూరుగూడెం

కొన్ని ఉదాహరణలు..

- సత్తుపల్లి మండలం సదాశివునిపేటలో బుధవారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి పదిరోజులు గడుస్తున్నా ఒక్క బస్తా ధాన్యం కొనుగోలు చేయలేదు.
- సదాశివునిపేట ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కాంటా వేసుకొని లోడింగ్ చేసుకొని మిల్లర్ల వద్దకు తీసుకెళ్లాక ధాన్యం బస్తాలను తరుగు ఇస్తేనే దిగుమతి చేసుకుంటామని చెప్పారు.
- సదాశివునిపేటలో తుంబూరు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ఒక్క గింజ కొనుగోలు జరగలేదు.
- ధాన్యాన్ని తూర్పారపట్టి తరుగు క్వింటాకు ఆరు కేజీలు, కాంటా ఖర్చు రూ.50 భరించి మంచి ధాన్యాన్ని రైతులకు ఇష్టం ఉంటే సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తామంటున్నారని తెలుస్తోంది.
- అలా ఒప్పుకోకపోతే దళారులకు 77 కేజీల బస్తా రూ.1,250కే అమ్ముకోవాల్సి వస్తోంది.

దిక్కులేకే ప్రైవేట్‌కు..



తుంబూరు కేంద్రానికి సుమారు 150 బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చా. ఇప్పటి వరకు ఒక్క బస్తా కొనుగోలు చేయలేదు. గంటగంటకు మబ్బులు కమ్మేస్తుండటంతో భయమవుతోంది. మిల్లర్లు కొర్రీ పెడుతుండడంతోనే కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని సమాచారం. దీంతో పలువురు దళారులకు అమ్ముకుంటున్నారు.

– వినుకొండ కృష్ణ, రైతు, సదాశివునిపాలెం

ఆరు కేజీల తరుగు తీస్తున్నారు..



సొసైటీ ద్వారా కొనుగోలు చేస్తే తేమ శాతం 17, క్వింటాకు ఆరు కేజీల తరుగు తీయమంటున్నారు. కాంటా ఖర్చులు రైతులే భరించాలట. సుమారు 270 బస్తాల ధాన్యాన్ని సొసైటీ కొనుగోలు కేంద్రాన్ని తీసుకొచ్చాను. అయినా కొనుగోలు చేయటం లేదు. చేసేదేం లేక వచ్చిన కాడికి దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి.

– మందపాటి వెంకటేశ్వరరెడ్డి, రైతు, సదాశివునిపేట

అమ్ముకోడానికి అవస్థ పడుతున్నాం



ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు అవస్థ పడుతున్నాం. వాతవరణ మార్పులతో పండించిన పంటను కాపాడుకునేందుకు రోజుల తరబడి రాత్రీపగలు కేంద్రాల వద్దే కాపలా ఉంటున్నాం. మండలంలో కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బండి శ్రీనివాసరెడ్డి, రైతు, కల్లూరుగూడెం

చిన్నారి వైద్యానికి చేయూత



చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పెనుబల్లి : ఏప్రిల్ 10న సాక్షి దినపత్రికలో 'మా బిడ్డకు బతుకు ఇవ్వండి' అని ప్రచురితమైన శీర్షికతో మండల పరిధిలోని గంగదేవిపాడు గ్రామానికి చెందిన బాలుడు క్రిష్టాఫర్ వైద్యం కోసం దాతల చేయూత కొనసాగుతుంది. కోదాడ వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి స్నేహితులు దుబాయి వారి సహకారంతో రూ.91,116ల చెక్కును ఫౌండేషన్ వ్యవస్థాపకుడు టి.ఆనంద్, సభ్యుడు జల్ది సంతోష్ కుమార్‌లు బాలుడి తండ్రి చెన్నారావుకు అందజేశారు. మరో రూ.3 లక్షలు దాతలు సహాయం చేస్తే తమ కుమారిడికి వైద్యం చేయించి బతికించుకోవచ్చని చెన్నారావు కోరారు. సాయం చేయాలనుకునే వారు గూగుల్ పే, ఫోన్ పే నంబర్ 9603396988 నెంబర్‌కు నగదు పంపించి తమను ఆదుకోవాలని వేడుకున్నారు.

ఫ్రీజర్‌బాక్స్ వితరణ

ఏన్కూరు: స్థానిక పంచాయతీ కార్యాలయానికి ఆఖరినిద్ర(ఫ్రీజర్‌బాక్స్)ను గ్రామానికి చెందిన దాతలు అమరనేని సుశీల, కృష్ణయ్య శనివారం అందించారు. అమరనేని వీరమ్మ, చంద్రయ్య, అమరనేని రంగమ్మ జ్ఞాపకార్థం ఈ బాక్సును అందజేశారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఉప సర్పంచ్ వేముల రమేష్, నర్సింహరావు, గుమ్మడెల్లి నాగేశ్వరావు, గాంధీ పాల్గొన్నారు.

ఆ ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి

ఎర్రుపాలెం: దళితబంధు పథకం అమలుకోసం లబ్ధిదారుల నుండి డబ్బులు తీసుకున్న ఎమ్మెల్యేల పేర్లను సీఎం కేసీఆర్ వెల్లడించడమే కాక వారి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు పార్టీ మండలాధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యాన శనివారం తహసీల్దార్ తిరుమలాచారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, పుప్పాళ్ల చంద్రమౌళి, మిరియాల నాగేశ్వరరావు, మల్లెల మోహన్‌రావు, మిరియాల వెంకటేశ్వరరావు, దూపగుంట్ల గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి హద్దుల ఏర్పాటు

వైరా: మండలంలోని రెబ్బవరం గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ భూమికి అధికారులు శనివారం హద్దులు ఏర్పాటుచేశారు. ఆలయానికి సంబంధించిన భూములకు వేరే వ్యక్తుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అధికారులు ఆ భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని రెబ్బవరం గ్రామస్తులు వైరాలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ మేరకు అధికారులు హద్దులు నిర్దేశించి బోర్డులను ఏర్పాటు చేసి స్పష్టమైన హామీ ఇవ్వడంతో రిలే నిరాహార దీక్షలను విరమించారు.

క్షతగాత్రులకు పండ్లు పంపిణీ

కల్లూరు రూరల్: ఏన్కూరు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కల్లూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన క్షతగాత్రులను శనివారం కల్లూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ విన్సెంట్ పండ్లను అందించారు.

అధ్యాయనోత్సవ పూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీ గీతాజ్ఞానమందిరంలో గల పార్థసారథిస్వామి వారి ఆలయంలో వార్షిక అధ్యాయనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. గుడివాడ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, పత్తి విశ్వేశ్వరరావు, ఏపూరి పురుషోత్తమరావు, వెంకటేశ్వరరావు, బాల లీలాకృష్ణ, గుర్నాథం, శంకర్‌రావు, రాఘవయ్య, భక్తులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌తో సేవా కార్యక్రమాలు



సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాదరణ పొందుతున్నదని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అన్నారు. క్లబ్ జోన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం వైరాలో నాలుగు చక్రాల తోపుడుబండిని అమర్లపూడి అనితకు అందజేశారు. లయన్ చావా బుచ్చయ్య కూతురు ధన్య జన్మదినం సందర్భంగా నిరుపేద మహిళలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు చింతోజు నాగేశ్వరరావ, వీడీజీ –2 నంబూరి మధు, జీఎంటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, జిల్లా మహిళా కో ఆర్డినేటర్ మాదినేని సునీత, సత్యంబాబు, ఉపేందర్ రావు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, రామారావు, కృష్ణమూర్తి, రాజారావు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

ఏన్కూరు: భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ పడిన ఘటనలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారావుపేటకు చెందిన ఉగ్గం వెంకటేశ్వర్లు, రాజ లింగాలకు చెందిన నంజాల వెంకటేశ్వర్లుకు బురదరాఘవాపురం రెవెన్యూ పరిధిలో భూములు ఉన్నాయి. నంజాల వెంకటేశ్వర్లు శనివారం పొలం పనులు చేయిస్తుండగా ఉగ్గం వెంకటేశ్వర్లు వచ్చి గొడవ పడి ఇరు కుటుంబ సభ్యులు దాడిచేసుకున్నారు. ఈ ఘటనలో ఉగ్గం వెంకటేశ్వర్లు, అతడి తల్లి జానకమ్మ, నంజాల వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఆనందరావు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేసి వారి సమస్యలు పరిష్కరించాలని పలువురు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. ఈ మేరకు పలు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



మధిరలో..



సత్తుపల్లిరూరల్: సమ్మెలో కార్యదర్శులు..



వైరారూరల్: దీక్షలో పంచాయతీ కార్యదర్శులు

కోరి తెచ్చుకున్న రాష్ట్రంలో కోటి సమస్యలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కల్లూరురూరల్: కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కోటి సమస్యలు ఉన్నాయని మాజీ మంత్రి, ఏఐసీసీ సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శనివారం మండల పరిధిలోని గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై రూపొందించిన పత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళితబంధు పథకంలో రాష్ట్రంలోని కొంతమంది ఎమ్మెల్యేలు లబ్ధిదారుల నుంచి రూ.3 లక్షలు దాకా వసూళ్లు చేసారని సీఎం చెప్పడం ప్రభుత్వం అవినీతికి అద్దం పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కొండూరు కిరణ్‌కుమార్, అంకిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కీసర శ్రీనివాసరెడ్డి, జిల్లేళ్ల కృష్ణారెడ్డి, తోట జనార్దన్, పడిగల రమేష్, పోతురాజు రాము, కుక్కా సాంబయ్య, వైకుంట బాబూరావు, కాటమనేని కృష్ణారావు, కల్లేపల్లి రమేష్, ఎస్‌కె.అఫ్రోజ్, సమీర్ నాయకులు ట తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా



రాజీనామా నిర్ణయాన్ని వెల్లడిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మధిర: మండలానికి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పలువురు ఆ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు మధిరలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. ఇక నుంచి పొంగులేటి వెంటే నడుస్తామని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన వారిలో దిశ కమిటీ మాజీ సభ్యుడు డాక్టర్ కోట రాంబాబు, మధిర 21వ వార్డు కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మీ తదితరులు ఉన్నారు. అలాగే, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ గ్రామ శాఖల బాధ్యులు ఐలూరి రామకోటమ్మ, నంద్రు కుమారి, తోక రాజరాజేశ్వరి, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, వేమిరెడ్డి వెంకటరావమ్మ, యన్నం రజిని, శీలం వీరవెంకటరెడ్డి, తాండ్ర జ్యోతి, చావలి రామరాజు, బండి వెంకటేశ్వర్లు, సిరియాల వెంకటేశ్వర్లు, కాశీ కోటేశ్వరరావు, ఐలూరి జనార్దన్‌రెడ్డి, గోళ్ల ఉద్దండు, అమరవాది సత్యనారాయణరెడ్డి, తోక వెంకయ్య, పుల్లయ్య, సయ్యద్ అక్బర్, బాహాటం శ్రీనివాసరాజు, సోమ రవికాంత్, అంకే సంధ్యారాణి, అంకె అప్పారావు, గుడిద రాధమ్మ, వెంపటి ప్రభాకర్ తదితరులు కూడా రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

బీజేపీని బలోపేతం చేయాలి

చింతకాని: మండలంలో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ నియోజకవర్గ ప్రభారి నూకల వెంకటరెడ్డి కార్యకర్తలకు సూచించారు. మండల పరిధిలోని వందనం గ్రామంలో పార్టీ మండల కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 30న ప్రధాని మోదీ నిర్వహించే మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతీ బూత్‌లో విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏలూరి నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్లపల్లి విజయరాజు, రామలింగేశ్వరరావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్దుమియా, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కోట సికిందర్, బీజేపీ మండలాధ్యక్షుడు ఆలస్యం వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొండా వెంకన్న, ఉపాధ్యక్షుడు తోటకూరి పానకాలరావు, బొర్రా శ్రీనివాసరావు, కార్యదర్శి అవులూరి శ్రీనివాసరెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు పంది కృష్ణయ్య, బూత్ అధ్యక్షుడు రామకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'వాయిస్ ఫర్‌గర్ల్స్'



శిక్షణ ఇస్తున్న ప్రతినిధి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న వాయస్ ఫర్‌గర్ల్స్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఎన్‌జీఓ సంస్థ, ఐటీడీఏ భద్రాచలం వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రతినిధులు బాలికలకు ఆరోగ్యం, హక్కులు, స్వయం అవగాహన, భవిష్యత్‌లో వారు ఎంచుకునే మార్గంలో అభివృద్ధి సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు వ్యక్తి గత పరిరక్షణ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్ట్ చర్చిని శనివారం ఫాదర్ చిట్టిబాబు ప్రారంభించారు. ఎంపీపీ దేవరకొండ శిరీష, మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పంబి సాంబశివరావు, నాయకులు సంక్రాంతి కృష్ణారావు, సగ్గుర్తి కిషోర్ బాబు, మొగిలి అప్పారావు, బొగ్గుల కృష్ణారెడ్డి, ఇనపనూరి భాస్కర్, వడ్లకుంట గోపాల్, పల్లె కంటి సుబ్బారావు, అద్దంకి కిషోర్, సంఘస్తులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి

మధిర: మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టారు. వాటిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి, మున్సిపల్ ఇంజనీర్ నరేష్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

మధిర: ఆయుర్వేదిక్ వైద్యానికి సంబంధించిన కరదీపికలను శనివారం స్థానిక ఆయుర్వేదిక్ వైద్యశాల వెల్‌నెస్ సెంటర్‌లో మధిర ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ వీరభద్రమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుర్వేదిక్ వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు సైతం నయమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి కుమారి, ఆయుష్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల రాంబాబు, అంగన్వాడీ టీచర్స్, వర్కర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లో సరుకులు పంపిణీ చేయాలి

తల్లాడ: రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని తల్లాడ డిప్యూటీ తహసీల్దార్ వనజకు ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు గోగినేపల్లి లలిత, గొడ్ల పుల్లమ్మ, చాపలమడుగు రావేలు, మరియమ్మ, రాంబాబు, నాయకులు ఎస్‌కె.లాల్‌మియా, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీపీఎస్‌లో డిజిటల్ బోధన

మధిర: స్థానిక సీపీఎస్ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ తెలిపారు. ఈ మేరకు డిజిటల్ బోధనపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ విధానాలను అవలంబిస్తూ తరగతి గదిలో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో నూతన విద్యా ఒరవడి అమలవుతుందని, నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందన్నారు.

ఓటర్ల నమోదుపై సమావేశం



ఎర్రుపాలెం: అవగాహన కల్పిస్తున్న తిరుమలాచారి



బోనకల్: సమావేశంలో మాట్లాడుతున్న శ్వేత

మధిర: అర్హులైన వారికి నూతనంగా ఓటు హక్కును కల్పించడం, వారిని చైతన్యపరచడం తదితర అంశాలపై రాజకీయ పార్టీల నాయకులకు తహసీల్దార్ రాజేష్ అవగాహన కల్పించారు. శనివారం వివిధ పార్టీల నాయకులతో తహసీల్‌లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ఓటు హక్కుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని తహసీల్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల నమోదులపై తహసీల్దార్ ఎస్ తిరుమలాచారి సమావేశమయ్యారు. నాయకులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పంబి సాంబశివరావు, ముక్కపాటి శ్రీనివాసరావు, దివ్వెల వీరయ్య తదితరులున్నారు.

బోనకల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదుపై అఖిలపక్ష నాయకులతో ఇంచార్జ్ తహసీల్దార్ సంగు శ్వేత సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, ఎంపీపీ కంకణాల సౌబాగ్యం, ఆర్‌ఐలు లక్ష్మణ్, సత్యనారాయణ, అఖిలపక్ష నాయకులు చేబ్రోలు మల్లికార్జున్, బీపీ నాయక్, దొండపాటి నాగేశ్వరావు, ఆకేన పవన్, బాలకృష్ణ పాల్గొన్నారు.